# మానవత మరుగున...

వేములకొండ రమణ



**గోపాలం** ఆత్మహత్య చేసుకున్నాడంటే నమ్మ శక్యం కాలేదు నాకు. ఒక్క నాకే కాదు, గోపాలాన్ని ఎరిగున్న వారందరూ ఆశ్చర్యపోయారు ఆ వార్త విని.

పోస్టుమార్టమ్ అయి శవాన్ని తిరిగి ఇస్తుంటే చూశాను వాడి ముఖంలోకి. అదే చిరునవ్వు...అదే గంభీరం...అదే ప్రశాంతత.

సాధారణంగా మనిషి డబ్బుతో, పదవులతో మారతా డంటారు. అది నిజం కాదని గోపాలాన్ని తెలి "సిన వా రెవరైనా అంటారు. హైస్కూలు చదివే రోజుల్నించి సెంట్రల్ గవర్నమెంటులో పెద్ద అఫీసరయిన ఈ నాటివరకు మాగోపాలంలో రవంత మార్పుకూడా చూడలే దెన్నడూ-ఎప్పుడూ అదే చిరునవ్వు, నిర్మలత, ప్రశాంతత, గాంభీర్యం.

"పూలమ్మిన చోటనే కట్టె లమ్మడం", "కష్టా లెప్పుడూ కట్ట కట్టుకొని వస్తాయి" లాంటి సామెత

లు గోపాలం జీవితంలో నిత్యానుభవాలే అయ్యాయి. అయినా, కష్టాలొస్తే క్రుంగిపోవడం, పదవులొస్తే పొంగిపోవడం జరగలే దెన్నడూ వాడి జీవితంలో. యూనివర్సిటీలో చదివే రోజుల్లో తండ్రికి క్షయ వ్యాధి వచ్చి తన చదువు ఆగిపోయే పరిస్థితి ఏర్పడ్డా, కొస్తకూడా దిగులు చెందక నిబ్బరంతో ఎలా నిలబడ్డాడో మాకు తెలును. ఏడేళ్ళుగా భార్య మంచంపడితే, గోపాలం తిరగని ఊరు లేదు, కలవని స్పెషలిస్టు లేడు, చేయించని వైద్యం లేదు. తన పిల్లలు తల్లి లేని వారు కాకూడదనే తపనతో భార్య వైద్యానికై చేసిన ఖర్చు, అటు భార్యకు, ఇటు పిల్లలకు చేసిన చాకిరీ మా గోపాలం మొండి ధైర్యానికి నిదర్శనం.

అటువంటిది గోపాలం ఆత్మహత్య చేసుకున్నాడంటే నమ్మే దెట్లా?

ఆ రోజు నా కింకా బాగా గుర్తుంది. గోపాలాన్ని ఓదార్చడానికి వెళ్ళిన రోజది.

తను పడ్డ శ్రమ, చేసిన ఖర్చు అన్నీ బూడిదలో పోసిన పన్నీరు చేస్తూ రాధ వదిన పోయిన రోజది.

ఏ ఫీలింగ్స్ లేని వాడి ముఖం చూసి ఓదార్పు మాటలు చెప్పబోయిన నా గొంతు విడలేదు...నా బదులు తనే మాట్లాడసాగాడు గోపాలం. "చూడు, రమణా!...మూత్రపిండాల వ్యాధికి ఇంగ్లీషు వైద్యంలో మందేం లేదు...కిడ్నీ మార్పిడికి రాధ పుట్టింటి వాళ్ళెవరూ ముందుకు రాలేదు...మరో గత్యంతరం లేక వారానికి రెండుసార్లు చొప్పున ఏణ్ణర్ధంగా హెమోడయాలిసిస్ చేయిస్తూ వచ్చాను వ్యర్థమే అని తెలిసికూడా. అయినా, రాధను కాపాడుకోలేకపోయాను ఇంకొన్నాళ్ళయినా."

దుఃఖం ఉబికి ఉబికి వస్తున్నా, గోపాలం ముఖం చూసి మూగనయ్యాను

ఖర్మకాండంతా సవ్యంగా పూర్తయిన పన్నెండో రోజు ఆటో దగ్గర నిలబడ్డ నా కళ్ళలో నీరు చూసి గోపాలమే అన్నాడు: "రమణా!...ఒక్కసారి నాకూ ఏడ్వాలని ఉందిరా—నీలా కాదు...నా పిల్లల్లా... పెద్దగా. కాని ఏడవలేను-ఏడవకూడదు. నేనేడిస్తే బెంబేలవుతారు పిల్లలు. వాళ్ళ గురించేగానే నిప్పుడు బ్రతికేది." కనీసం చెమర్చలేదు గోపాలం కళ్ళు. నేను బెక్కుతుంటే, ఆటో కదిలింది వేగంగా.

అటువంటిది గోపాలం ఆత్మహత్య చేసుకున్నాడంటే ఆశ్చర్యంగాక మరేమిటి! అందులోనూ భార్య పోయిన ఆర్నెల్లకే!

అంతటి ధీరోదాత్తుడు, కష్టసుఖాలను ఒక్కలా ఎదుర్కొనే జగమొండి మా గోపాలం ఆత్మహత్య చేసుకోవడమా!...నో...నో...ఇంపాసిబుల్...ఇట్ కాంట్ బి...ఇట్ మస్ట్ బి యాన్ యాక్సిడెంట్...ఆర్...ఎ మర్డర్...ఎస్...అవును. హత్యే అయి ఉంటుంది.

మరి..."నా చావుకు ఎవరూ బాధ్యులు కారు" అని గోపాలం వ్రాసిపెట్టిన ఉత్తరం!?!

అందుకే మా గోపాలం మరణం నా కో పెద్ద పజిల్!...ఓ మిస్టరీ!


"అయ్యో!" అనే వారే తప్ప అసలు ఏం జరిగింది? ఎందు కిలా జరిగింది? నిజంగా ఇది ఆత్మహత్యేనా, లేక హత్యా అని వాడి గురించి ఆలోచించే వారెవరూ నాకు కనపడలేదు.

ఎందుకో తెలియదుగాని, గోపాలం విషయం పూర్తిగా ఆరా తియ్యాలనే పట్టుదల నాలో హెచ్చింది.

మాగోపాలం పిల్లల్లో పెద్దది పద్మ. టెన్త్ కాబోలు చదువుతూంది. మిగిలిన ఇద్దరూ చిన్న క్లాసుల్లో ఉన్నారు. పిల్లల దగ్గరనుంచి గోపాలం తల్లివరకు అందరి దగ్గరా నాకు చనువే.

మాగోపాలం ఓ ఒరేషియస్ రీడర్. కానీ, డైరీ వ్రాసుకునే అలవాటు వాడికి ఏ కోశానా లేదు. నూతన వత్సరానికి మంచి మంచి డైరీలు వస్తే, వాటిని ఏ పద్దు పుస్తకంగానో, చాకలి పద్దుగానో మారుస్తాడని వాణ్ణి ఎప్పుడూ ఆట పట్టించేవాణ్ణి. ఒక్క పుస్తకాల పురుగే కాదు మా వాడు. తను చదివే నవలల్లో ఏవైనా మంచి కొటేషన్స్ లభిస్తే, వాటిని వెంటనే తన అకౌంటు బుక్‌లో—అంటే తన డైరీలో—ఆ రోజు క్రింద నోట్ చేసేసేవాడు. నే నెప్పుడు కథలు వ్రాసినా వాడికి విన్పించడం, వాడు సందర్భోచితంగా ఓ మాంచి కొటేషన్ అందివ్వడం మామూలు.

ఓ ఆదివారం గోపాలం ఇంట్లో పుస్తకాల బీరువాలో వెతుకుతుంటే అనుకోకుండా చేతికి తగిలింది వాడి లేటెస్ట్ అక్కౌంట్ బుక్—అంటే



కరెంట్ డైరీ. ఇతరుల డైరీ చూడటం తప్పని తెలిసినా, మా ఇద్దరి మధ్య ఉండే ఆత్మీయత దృష్ట్యా పేజీలు తిరగేయసాగాను ఆత్రతతో. ఎర్ర సిరాతో మార్చి పదవ తేదీ రౌండ్ చేసి ఉంది-రెడ్ లెటర్ డేగా...అదే రాధ వదిన పోయిన రోజు.

అలా డైరీ పేజీలు తిరగవేస్తూ పోతున్న నాకు సెప్టెంబర్ ఎనిమిది, తొమ్మిది తేదీ పేజీల మధ్య ఓ కవరు కనిపించింది. కుతూహలంతో కవరు విప్పాను. "ప్రియమైన చెల్లి రాధకు" అని మొదలయితే అది ఉత్తరం అని తెలిసి వెంటనే కవర్లో పెట్టేశాను. కవరు మళ్ళీ డైరీలో పెట్టేస్తుండగా, తొమ్మిదవ పేజీ క్రిందగా వ్రాసి ఉన్న రెండు పంక్తులు చదవకుండా ఉండలేకపోయాను. "మనసున్న మనిషికి...సుఖములే దంతే"—అది మా గోపాలం రైటింగే. గురూజీ ఆత్రేయ వ్రాసింది అక్షరాలా నిజం. మనసుంది కనకే మాగోపాలానికి జీవితంలో సుఖం లేకుండా పోయింది.

ఇంకా పేజీలు తిరగేస్తూ పోయాను...తొమ్మిది...పది...ఠక్కున నిలిచిపోయింది నా చూపు ఆ పది మీద...ఎర్ర సిరాతో పది మీద పెద్ద ఇన్‌టూ గుర్తు...పది... సెప్టెంబర్ పది!...ఆఁ...అదే—గోపాలం టాంక్ బండ్ మీదనుంచి ఉరికిన రోజు!

నా ఒళ్ళు జలదరించింది...ఒక్కసారిగా నా ఆలోచనలన్నీ స్తంభించినాయి...మార్చి పది, సెప్టెంబర్ పది...ఈ మధ్యకాలంలో ఏదో జరిగుండాలి. అది మనసును తీవ్రంగా గాయపరచినదై ఉండాలి. అదికూడా తొమ్మిదో తేదీన జరిగుండాలి. అందుకే గురూజీ పాటలోని ఆ చరణమే డైరీలో వ్రాసుకున్నాడు...ఏమిటై ఉంటుంది ఆ విషయం?...ఏం జరిగుంటుంది ఆ రోజు?...కలతలకు కలవరపడే వ్యక్తి కాడే గోపాలం...ఎంతటి కఠిన పరీక్షనైనా ధైర్యంతో ఎదుర్కొనే ధీశాలే మా వాడు... మరి వాడి కెదురయిన ఆ గడ్డు సమస్య ఏమై ఉంటుంది? అంతలా వాణ్ణి దెబ్బ తీసినది ఏమిటై ఉంటుంది?...ఇలా ఎన్నో, ఎన్నెన్నో ఆలోచనలు.

ఎలాగో తేరుకుని మార్చి పదినుండి ఒక్కొక్క పేజీ మళ్ళీ తిరగెయ్యసాగాను. సెప్టెంబర్ ఎనిమిది, తొమ్మిది తేదీ పేజీల మధ్య మళ్ళీ అదే కవరు. ఒకవేళ ఏదైనా "క్లూ" దొరుకుతుందేమో ఆ ఉత్తరంలో!...ఆశ!...చూస్తే తప్పేముం దనిపించింది...అంతలోనే సభ్యత అడ్డువచ్చింది...మరుక్షణం నా మిషన్ గుర్తుకొచ్చింది...నేనో పరిశోధకుణ్ణి...చూస్తే తప్పేమిటి?...తెగింపుతో ఉత్తరాన్ని విప్పాను గబగబా. చదవసాగాను మెలమెల్లగా—

విశాఖపట్నం
26-2-83

"ప్రియమైన చెల్లి రాధకు,

నీ అక్క సుశీల దీవించి వ్రాయునది. ఇక్కడంతా క్షేమం. అక్కడ నువ్వూ, పిల్లలూ కులాసా అని తలుస్తాను.

పోస్టుమన్ ఉత్తరాలు తెచ్చే వేళలో నీ మొగుడు ఆఫీసులో ఉంటాడని నువ్వెంత చెప్పినా, ఎందుకయినా మంచిదని మీ ఎదురింటి పార్వతమ్మ అడ్రసుకు వ్రాస్తున్నాను ఈ ఉత్తరం. మొన్న మీ ఊరి నుండి బయలుదేరే ముందు ఈ సాయం చేసిపెట్టమని ఆవిడని అడిగాను. కనుక నీ కీ ఉత్తరం తప్పక అందుతుందని ఆశిస్తున్నాను. ఎందుకయినా మంచిది ఉత్తరం చదవగానే చింపేయి. దాచిపెట్టకు.

నీకు రాకూడని జబ్బే వచ్చింది. ఆ జబ్బే మన పెద్దక్కయ్యకు వచ్చిన సంగతి తెలుసు. ఈ జబ్బుకు వైద్యం లేదంటారు. జబ్బులెన్ని ఎక్కువయితే, రోగు లెంతమంది ఎక్కువయితే అంత మంచిది డాక్టర్లకు. నిన్నూ, నీ మొగుణ్ణీ బాగా బుట్టలో వేశాడు మీ డాక్టరు. లక్షలకు లక్షలు తెచ్చి డయాలిసిస్ పేరిట ఆసుపత్రికి, డాక్టర్లకు పోసేస్తున్నాడు నీ మొగుడు.

అయినా, నీ మొగుడికి మా మీద ఎందుకే అంత కోపం? అంతమంది అన్నదమ్ములు, అక్కచెల్లెలు ఉండికూడా ఎవరూ కిడ్నీ దానం చేయలేదనేగా? నీ మొగుడి పిచ్చిగాని, ఇదేమన్నా ఏ బాంకునుంచో వెయ్యో, వందో తీసిఇవ్వడమా ఏమన్నానా? ఆ మాటకొస్తే మొన్న కె. జి. ఆసుపత్రిలో ఏం జరిగిందో తెలుసా? ఆరేళ్ళుగా కాన్సరుతో బాధపడుతూ, చావడానికి సిద్ధంగా ఉన్న మా పెద్ద ఆడపడుచుకు ఇవ్వడానికి ఆమె గ్రూపు రక్తం ఊళ్ళో ఎక్కడా దొరకలేదట. తనది ఆ గ్రూప్ రక్తమేనని మా ఆయన భుజా లెగరేస్తుంటే, 'ఏమండీ!' అంటూ కళ్ళెర్ర చేసేటప్పటికి ఇంటికి తుర్రుమన్నారు మీ బావగారు.

అందుకే నీ ఖర్చుదారీ మొగుడిలా డయాలిసిస్‌లాంటి పిచ్చి పిచ్చి పోకడలకు పోకుండా, మన అక్కయ్యలను ఇంటివద్దే ఉంచి, ఏదో నామ్‌కేవాస్తే వైద్యం చేయించారు మన పుట్టింటివారు తెలివిగా. అందుచేతే అక్కయ్యలు పోయినా డబ్బు, బంగారం బయటకు పోకుండా కాపాడగలిగారు.

అసలు నీ వరిస్థితి ఇలా ఉందనే, మీ ఇంటికి స్వామీజీని తీసుకొచ్చాను ఆ మధ్య. రాత్రిళ్ళు ఆయనకు కాళ్ళు నొక్కమంటే ఇష్టపడలేదు నువ్వు. నాలా నువ్వు స్వామీజీకి కాళ్ళు నొక్కి ఉంటే, నీ కీ డయాలిసిస్ గొడవే ఉండకపోయేది.


ఇంక నీ సంసారం గురించి...మొన్న నే వచ్చే ముందు అన్నీ సూరిపోసినా ఎందుకైనా మంచిదని మళ్ళీ వ్రాస్తున్నాను. ఎందుకంటే, నువ్వుత్తి వెర్రిబాగులదానివి. నీ అత్తగారు, మొగుడు నీ కేదో సేవ చేస్తున్నట్లు నటిస్తే, అదంతా నిజమని, నీ మీద ప్రేమాభిమానాలే అని అనుకుంటావు. నిజానికి నువ్వెప్పుడు పోతావా, నువ్వు జాగర్త చేసిన బంగారం ఎప్పుడు కాజేద్దామాఅని గుంట నక్కలా చూస్తూంది నీ అత్తగారు. ఎప్పుడు నువ్వు పోతావా, ఎప్పుడు మళ్ళీ పెళ్ళి చేసుకుందామా అని కాచుక్కూర్చున్నాడు నీ మొగుడు. ఉన్నది ఉన్నట్టుగా మాట్లాడితే కోపం నీకు. కాని, అక్కగా మంచీ, చెడ్డా చెప్పవలసిన బాధ్యత నా కుంది.

మొన్న వచ్చే ముందు అయిష్టంగానైనా రెండు నెక్లెసులు, మూడు గొలుసులు, రెండు జతల గాజులు, జత దుద్దులు నా కిచ్చి నా చెల్లెలు వనిపించుకున్నావు. కాని, పద్మ ఉండగా ఇవ్వడం మోసం అయింది. అది ముమ్మూర్తులా ఆ తండ్రి బిడ్డే. నాకు నువ్వు వస్తువులు ఇస్తుంటే 'డాడీకి చెప్తా'నని ఫోను వద్దకు పరిగెత్తింది. 'నొక్కేస్తా'నని పీక పట్టుకునేసరికి ముఖం తిరిగి పడింది. నేనొచ్చేశాక గాని తండ్రితో చెప్పిందా? ఏమైనా పద్మ వయస్సు వస్తున్న పిల్ల. మన విషయాలు దానికి తెలియడం మంచిది కాదు.

నిన్నూ, నీ పిల్లల్నీ తలుచుకుంటే గుండె తరుక్కుపోతుంది. నువ్వో వెర్రి పిల్లవి. 'నిద్రాహారాలు మాని రాత్రింబవళ్ళు సేవ చేస్తున్నాడు నా భర్త' అని తృప్తిపడే పిచ్చి మనసు నీది. మలమూత్రా లెత్తిందని నీ అత్తగారి దంతా అభిమానమే అనుకునే బేల మనసు నీది. నువ్విలాగే ఉంటే పూర్తిగా నిన్ను బుట్టలో వేసేసుకుంటారు వాళ్ళు.

'ఆలస్యం అమృతం విషం' అన్నారు మన వాళ్ళు. చేతులు కాలకుండానే పుట్టింటి వారి మాటలు నీ చెవికెక్కితే అంతకన్న కావలసింది ఏముంది? ఎప్పటికయినా నీ పిల్లల్ని ఆదుకునేది, సాకేది నేను, చెల్లి సుగుణ మాత్రమే. అంతేగాని, నీ అత్తవారి తరఫు వారు కాదు. నువ్వు పోగానే, నీ మొగుడి గారి కొత్త పెళ్ళాం, నీ అత్తగారు కలిసి నీ పిల్లల్ని పని పిల్లలుగా మారుస్తారు. కొత్త మోజులో కులుకుతూ ఉంటాడు నీ మొగుడు.

చెల్లి సుగుణ నుండి మొన్ననే ఉత్తరం వచ్చింది. ఎలాగయితేనేం, సుశీల, మరిది సుందరం బదిలీ మీద హైద్రాబాదు చేరుకోవడం



మన అదృష్టం. ఈమధ్య తను మీ ఇంటి నుంచి నడిపించేసిన డబ్బు, బంగారం గురించి వ్రాసింది సుగుణ. ఇంత త్వరలో నీలో ఇంత మార్పు వస్తుందని కలలోకూడా అనుకోలేదు. చాలా ఆనందంగా ఉంది. ముందుగా ఫోను చేసి మరీ నీ ఇంటికి వెళ్ళుతుండమని వ్రాశాను. అది ఫోన్ చేసినప్పుడు-నీ అత్తగారు, నీ మొగుడు ఉండని సమయాలు చెప్పు. వాళ్ళు లేని సమయంలోనే వస్తుంటుంది సుగుణ. అందినంత మట్టుకు డబ్బూ, దస్కం దానికి ఇచ్చేస్తూండు.

దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోమన్నారు మన పెద్దలు. నువ్వు బ్రతికుండగానే నీ పదహారేళ్ళ సంసార జీవితంలో నీ అత్తగారింట్లో వెనకవేసినదంతా చేరిపోవాలి త్వరగా. నువ్వు పోయే నాటికి విలువైన వస్తువేదీ మిగలకూడదు నీ ఇంట్లో. అంతా మా వద్దకు చేరిపోవాలి. ఎందుకంటే, నీ కీ భూమ్మీద నూకలు ఇంకెన్ని రోజులున్నాయో ఎవరు చెప్పగలరు? మావద్ద ఉంటే ఇనప్పెట్టెలో ఉన్నట్లే.

ఇంత నిక్కచ్చిగా వ్రాస్తున్నందుకు మరోలా అనుకోకు. నీ మొగుడు ఓ వెర్రిబాగులాడు. జీతం తెచ్చి నీ చేతిలో పెట్టడం తప్ప ఇంకేదీ పట్టించుకోడు. ఎంత సేపు ఆఫీసు, పని అని దేవులాడుతాడు. ఈ విషయంలో అక్కచెల్లెళ్ళందరిలోనూ నువ్వు అదృష్టవంతురాలివి.

మా ఖర్మం కొద్దీ ఈ తంబిగాడొకడు మధ్య. సొంత తమ్ముడై ఉండికూడా కాష్ ఫిక్సెడ్ డిపాజిట్‌లోనూ, బంగారం బాంక్ లాకర్‌లోనూ వేయమని తెలివి తక్కువ సలహాలు ఇస్తూ వచ్చాడు నీకు.. అలాగాని చేసి ఉంటే ఈ పాటికి నీ మొగుడికి తెలిసిపోదూ? వాడి చేతిలో పడిపోవూ అన్నీ? అదృష్టవశాత్తూ తంబికి బెంగుళూరు ట్రాన్స్‌ఫర్ అవడం, అదే సమయానికి సుగుణ, సుందరం హైద్రాబాదు చేరుకోవడం జరగబట్టి సరిపోయింది. లేకపోతే నీ పిల్లల గతి ఏమయ్యుండేదో!

అన్నట్లు మరో ముఖ్య విషయం. నీ పురుళ్ళన్నీ హైద్రాబాదులో మెటర్నిటీ హోమ్‌లో పోసుకున్నా పుట్టింటి వాళ్ళనుండి తడవకు రెండు, మూడు వేలు చొప్పున వసూలు చేసేదానివి. అలాగే పండగని, పబ్బమని పుట్టింట్లో వసూలు చేసింది, దొంగ లెఖ్ఖలు చెప్పి నీ మొగుడి దగ్గర నెలకు అయిదు వందలు చొప్పున వెనక పెట్టిందీ అంతా కలిపి 80 వేలదాకా వడ్డీలకు తిప్పమని మన అన్నయ్యలు వాసూ, శీనూల దగ్గర ఇచ్చినట్టు తెలిసింది. వాళ్ళు అంత సులువుగా డబ్బు తిరిగి ఇవ్వరు. తెలుసుగా నీకు-అమ్మ పోతే బంగారం ఇవ్వడానికి మనల్ని ఎన్ని తిప్పలు పెట్టారో! అందుకే ఆలస్యం చేయకుండా వెంటనే వాళ్ళ దగ్గరనుంచి ఆ డబ్బు రాబట్టి నా దగ్గర, సుశీల దగ్గర అట్టే పెట్టు. జాగ్రత్తగా ఉంటుంది.

మీ ఊరు వచ్చినప్పుడల్లా నిన్ను చూడ్డానికి వస్తాడు కదా అని పాప మొగుడు మూర్తిని మీరు మరీ నమ్మేస్తున్నారు. వాడు చాలా గడుసుపిండం. తీయగా కబుర్లు చెప్తాడు. వాణ్ణి నమ్మి మూడు వేలు కాష్ ఇచ్చావని, ఇంటి స్థలం కొని పెట్టమని నాలుగు వేలు ఇచ్చావని తెలిసింది. స్థలం కొన్న కాగితాల గురించి సుందరం ఎంత తిరిగినా ఇంతవరకు వాడు ఇవ్వలేదు.

ఆఖరి చెల్లి కదా అని పాపకు ఓ గొలుసు, రెండు జతల గాజులు ఇచ్చావు. ఓ జత ఎలాగో మూర్తి కళ్ళ పడింది. అందుకే నా మాట వినమని లక్షసార్లు చెప్పాను. పాపదగ్గర ఇంతవరకు దాచింది చాలు. ఇంకేం దాని కివ్వకు. ఎప్పటికయినా నేనూ, సుగుణే నీ పిల్లల్ని చేరదీయవలసిన వాళ్ళం.

ఇంకో సంగతి. మీ ఇల్లు పూర్తి చేయడానికి నీ మొగుడు డబ్బుకు నానా అవస్థపడుతున్న సమయంలోకూడా నువ్వు మాకు సర్దిన పదివేల సంగతి మూర్తిగాడికి ఎలాగో తెలిసింది. అతనుగాని నిన్నడిగితే, అంతా అబద్ధమని చెప్పు.

ఇప్పటికే చాట భారతం అయింది నా ఉత్తరం.

చదువుకొని చింపేయడం మరిచిపోకేం? చాలా ప్రమాదం.

లేచి కూర్చొని వ్రాయలేవు గనుక, సంగతులు సుగుణకి చెప్పు. అది నాకు వ్రాస్తుంది.


పిల్లలకు నా దీవెనలు.

ఇట్లు,
-సుగుణ."

నా తల తిరిగిపోసాగింది—ఏమిటిది?...ఇవేం కుయుక్తులు?...ఇవేం కుట్రలు?...ఏమిటీ ఘోర కలి?...ఇటువంటి మనుషులుకూడా ఉంటారా ఈ భువిలో?...తోబుట్టువులా వీళ్ళు?...ప్రేమాభిమానాలు లేకపోతే మానె, కనీసం మానవతకూడా లోపించిందే ఈ నరరూప రాక్షసుల్లో!

అసలు మారాధా గోపాలాల జీవితాల్లోకి అడుగు పెట్టే అధికారం ఎవరిచ్చారు వీళ్ళకు? గోపాలం పెళ్ళయిన తరువాత పురిటికీ, పుణ్యానికి ఆదుకోలేదు సరికదా, మా రాధ వదిన చావుబ్రతుకుల్లో నెలల తరబడి ఆసుపత్రిలో ఉన్నా కనీసం చుట్టపు చూపుగా కూడా రాని ఈ పుట్టింటి వారు ఎలా ఊడిపడ్డారు మావదిన ఆఖరి క్షణాల్లో! ఈ సంగతే ఏదో సందర్భంలో గోపాలంతో ప్రస్తావిస్తూ "అసలే జబ్బు మనిషితో నువ్వు నానా అవస్థలు పడుతుంటే, మళ్ళీ ఈ చుట్టాలంతా ఏమిటోయ్" అన్నాను. అందుకు-"రాధ తల్లితండ్రులు లేనాడే పోయారు. అన్నదమ్ములు మాటవరసకైనా పలకరించరు. ఇలా అక్కచెల్లెళ్ళయినా కనీసం వచ్చిపోతుంటే ఆ జబ్బు మనిషికి కాస్తంతయినా ఊరట కదా అని" అన్నాడు గోపాలం.

అదీ సంగతి



ఎగ్రిమెంట్‌లో వాళ్ళకిచ్చే జీతాలకి వాళ్ళు కష్టపడి పని చేయాలని వ్రాయడం మర్చిపోయాం సార్...

మాగోపాలం నమ్మకాన్ని బాగానే వమ్ముచేశారు వాడి వదినా మరదళ్ళు, తోడల్లుళ్ళు. కాని, ఈ చీడపురుగుల దాడికి మా రాధ వదిన ఎలా బలైపోయింది? గోపాలాన్ని అంతగా ప్రేమించేదే! ఈ చెదపురుగుల పాలై ఎలా మారిపోయింది అంతలా? ఇదే కాబోలు బ్రెయిన్ వాషింగ్ అంటే! పంచతంత్ర కర్త విష్ణుశర్మనే తలదన్నేరు మా గోపాలం వదినా మరదళ్ళు-ఈ బ్రెయిన్ వాషింగ్ ప్రయోగంలో.

ఈ ఉత్తరం గాని గోపాలం కళ్ళబడిందా?...చూసి ఉండకపోతేవాడి డైరీలో కెలా వస్తుంది ఈ ఉత్తరం?

చదివి ఎంత బాధపడ్డాడో మా, గోపాలం!...నో...అది వాడి తత్త్వమే కాదు. మహా అయితే కుత్సిత మనస్కులైన తన వదినా మరదళ్ళపై జాలిపడి ఉంటాడు. అంతే.

మరి ఎందుకు ఇలా జరిగింది?

"ఇప్పుడు నే బ్రతికేది ఈ పిల్లలకోసమేరా" అన్న గోపాలం హఠాత్తుగా ఎందుకు తన జీవితానికి ముగింపు తెచ్చుకున్నాడు?

ఎవరినైతే ప్రాణాధికంగా ప్రేమించాడో, ఎవరినైతే క్షణమైనా విడిచి ఉండలేదో, ఎవరినుండయితే నెలయినా తనకు ఉత్తరం రాలేదని విదేశం నుండికూడా తిరిగి వచ్చేశాడో, ఎవరి గురించయితే నిద్రాహారాలు లేకుండా ఆసుపత్రుల చుట్టూ తిరిగాడో, ఎవరి సదుపాయం నిమిత్తం ఇంటినే ఓ ఆసుపత్రిగా మార్చాడో, ఎవరి వైద్యం గురించయితే కట్టుకున్న ఇల్లే అమ్మేశాడో-

ఆమె...

ఆ రాధే...

తన భార్యే...

తనని "ఔట్" చేసిందన్న వ్యథను భరించలేకపోయాడనుకుంటా.

సర్వస్వం అనుకున్న తన అర్ధాంగే తనని "ఛీట్" చేసిందన్న వ్యథను భరించలేక పోయాడనుకుంటా.

ఈ లోకంలో నమ్మతగ్గ వ్యక్తే లేడనుకున్నాడు కాబోలు.

బ్రతుక్కి అర్థమే లేదనుకున్నాడు.

ఫలితమే ఎవ్వరూ ఊహించని ఈ ట్రాజెడీ!

నా గుండె బరువెక్కింది. జ్వరం వచ్చినట్లు కాలిపోసాగింది ఒళ్ళు. రక్తం ఉడికింది పగతో...కక్షతో.

మా గోపాలం ఆత్మహత్య చేసుకోలేదు. అది హత్యే. ఆత్మీయుల్లా చెంత చేరి మెల్లమెల్లగా సీజర్‌ని పొడిచినట్లు తీయని మాటలతో రాధను, గోపాలాన్ని చంపారు నిలువునా!...చాలా ప్లాన్డ్‌గా చేసిన హత్య లివి...ఏ ప్రొఫెషనల్ మర్డరర్ కూడా చేయలేని డబుల్ మర్డర్స్...బుచ్చరీ...మానవత్వం మరుగున తడి గుడ్డతో గొంతు కోయడమే ఇది...హాట్స్ ఆఫ్ టు ది మర్డరెసెస్!...మానవత మరుగున దాగి ఉండే ఈ బందిపోట్లు, దోపిడీదార్లు, నర భక్షకులు ఎక్కడో కాదు, మన బంధువుల్లోనే...మన కుటుంబాల్లోనే...మన మధ్యే ఉంటారు...జాగ్రత్త!...బివేర్!

★